క్లుప్తంగా

చెత్త నుంచి సంపద సృష్టించాలి



ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న డీపీఓ వెంకట నాయుడు

బేస్తవారిపేట: చెత్త నుంచి సంపద సృష్టించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకట నాయుడు పేర్కొన్నారు. బేస్తవారిపేటలోని చెత్త నుంచి సంపద తయారు కేంద్రాలను(ఎస్‌డబ్ల్యూపీసీ) మంగళవారం ఆయన పరిశీలించారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు, సిబ్బందితో మాట్లాడారు. తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీల్లో నిల్వ చేసుకోవాలన్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను ఆరుబయట పడేసి తగలబెట్టకుండా పంచాయతీకి ఆర్థిక వనరుగా మార్చుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పగటి పూట విద్యుత్ అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఈ

కంభం: రైతులకు పగటి పూట ఎటువంటి అసౌకర్యం కలగకుండా 9 గంటల విద్యుత్‌ను అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం కంభం సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అర్ధవీడు మండలంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు కంభం 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి నాగులవరం 33 కేవీ సబ్‌స్టేషన్ వరకు ఉన్న లైనుకు అదనంగా మరోలైను ఏర్పాటు చేసిన నేపథ్యంలో టెస్ట్ చార్జ్ చేసి పరిశీలించారు. కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ డీఈఈ టి.సత్యనారాయణ, ఆపరేషన్ డీఈఈ కె.శ్రీనివాసరెడ్డి, ఏఈ నర్సయ్య పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపొందించేందుకే సైన్స్‌ఫేర్



వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు

కొనకనమిట్ల: విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానం పెంపొందించేందుకు సైన్స్‌ఫేర్ దోహదపడుతుందని ఎంఈఓ–2 బి.నరసింహారావు పేర్కొన్నారు. మండలంలోని గొట్లగట్టులో కేజీబీవీ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని హెచ్‌ఎం విజయలక్ష్మి, కేజీబీవీ ప్రిన్సిపాల్ సురేఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్ ప్రాముఖ్యత, రామన్ ఎఫెక్ట్ సిద్ధాంతం తదితర అంశాలను వివరించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి బహుమతులు అందజేశారు. ముందుగా సీవీ రామన్, అబ్దుల్ కలాం చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేరెడ్డిపల్లి, నాగంపల్లి, పేరారెడ్డిపల్లి, తువ్వపాడు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై సైన్స్ ప్రాజెక్టులను తిలకించారు.

ప్రభుం ప్రాణనాథం..



తర్లుపాడులోని సహస్ర లింగేశ్వరస్వామి



పొదిలిలో ముస్తాబైన నిర్మమహేశ్వరాలయం



కొనకనమిట్ల : ఎదురాళ్లపాడులోని సంగమేశ్వరాలయం



కొమరోలు : విద్యుత్ వెలుగుల్లో త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం

- మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన శివాలయాలు
- లింగోద్భవ పూజలు, శివ కల్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు
- భక్తుల జాగారానికి సాంస్కృతిక కార్యక్రమాలు

బేస్తవారిపేట: దేవదేవుడు.. సదానందుడు.. సాంబశివుడి పూజలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని అన్ని శివాలయాల్లో ఆలయ కమిటీలు, దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బేస్తవారిపేట మండలంలోని సలకలవీడు రామలింగేశ్వర స్వామి ఆలయంలో గణపతి పూజ, మహా రుద్రాభిషేకకాలు, కాలభైరవ, నవగ్రహ హోమాలు, సాయంత్రం శివపార్వతుల కళ్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బిక్కా రామాంజనేయరెడ్డి తెలిపారు. చక్రాల రాఘవేంద్ర శర్మ సిద్ధాంతితో శివ కళ్యాణ వైభవం ప్రవచనం, రాత్రికి కోలాట భజనలు, అన్న సంతర్పణకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మోక్షగుండం సమీపంలోని ముక్తీశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు చిన్నారులతో కోలాటం, సాయంత్రం 6.30 మహిళల కోలాట ప్రదర్శన, రాత్రికి చింతామణి నాటకం ఏర్పాటు చేశారు.

కొమరోలు: మండలంలోని గోపాలునిపల్లె గ్రామంలో త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం, పామూరుపల్లెలో సాంబ సదాశివాలయం, పొట్టిరెడ్డిపల్లెలో భృగుమల్లేశ్వరస్వామి ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పొదిలిరూరల్: పొదిలిలోని పార్వతీ సమేత నిర్మమహేశ్వర స్వామి ఆలయంతోపాటు పంచకోవెలలను సుందరంగా ముస్తాబు చేశారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు, టెంట్లు, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. మంగళవారం స్వామివారు పార్వతీ పరమేశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కళ్యాణం సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పుర వీధుల్లో ఊరేగించారు. ఆలయంలో ఏర్పాట్లను ఎస్సై వేమన పరిశీలించారు. రథోత్సవం ఏర్పాట్లపై ఈఓ నారాయణరెడ్డితో చర్చించారు. రథం తిరిగే ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్సై చెప్పారు.

కొనకనమిట్ల: మండలంలోని ఎదురాళ్లపాడు సంగమేశ్వరాలయం, సలనూతల కొండల్లో వెలసిన అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంతోపాటు అన్ని శివాలయాలను వేడుకలకు సిద్ధం చేశారు. బ్రాహ్మణపల్లిలో అన్నదానం చేయనున్నారు. అంబాపురంలో శివరాత్రి ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. సలనూతలలో గురువారం రామలింగేశ్వరస్వామికి కుంకుమ బండ్ల ఉత్సవం, అంబాపురంలో బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులోని సహస్ర లింగేశ్వరస్వామి ఆలయం, కేతగుడిపిలోని శివాలయంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మార్కాపురం, తర్లుపాడు, కంభం, కొనకనమిట్ల తదితర మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

గిద్దలూరు రూరల్: పాపులవీడు క్షేత్రంలోని భైరవేశ్వర స్వామి ఆలయంలో నిర్వాహకుడు రామిరెడ్డి భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కె.ఎస్.పల్లె సమీపంలో గల భీమలింగేశ్వరస్వామి ఆలయం, పట్టణంలోని పాతాళనాగేశ్వరస్వామి ఆలయంలో పూజలకు ఏర్పాట్లు చేసినట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

మార్కండేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



భేరి పూజలో పాల్గొన్న అర్చకులు

మార్కాపురం టౌన్: మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం ధ్వజారోహణం, భేరి పూజతో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, రెంటచింతల వరుణ్‌తేజ శర్మ ఆధ్వర్యంలో ఈఓ చెన్నకేశవరెడ్డి, పలువురు ఉభయదాతలు స్వామివారి పూజల్లో పాల్గొన్నారు. కాగా బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని లింగోద్భవ కాలంలో స్వామివారికి రుద్రాభిషేకం, అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తామని ఈఓ తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలు మార్చి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

చిరస్మరణీయుడు 'ఉయ్యాలవాడ'



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

గిద్దలూరు రూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిరస్మరణీయుడని విశ్రాంత అధ్యాపకుడు సూరా నారాయణరెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతి కార్యక్రమాలను ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో మండలంలోని ముండ్లపాడు, కేఎస్ పల్లె హైస్కూళ్లలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకుడు మాట్లాడుతూ.. దేశం కోసం పోరాడి ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. దేశచరిత్రను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, కిసాన్ మోర్చా కార్యదర్శి పి.రమేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు అప్పిసెట్టి ఉదయ్‌శంకర్, ప్రధానోపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

కంభం: పట్టణంలోని అర్బన్ కాలనీలో అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. అర్బన్ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించగా అర్ధవీడు మండలం యాచవరం గ్రామానికి చెందిర్దెం.శ్రీనివాసులు అనే వ్యక్తి వద్ద 12 మద్యం సీసాలు లభ్యమయ్యాయని చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

చిన్నారుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



ఫీడ్ బ్యాక్ చార్ట్‌ను ప్రదర్శిస్తున్న డీసీపీఓ, సీడీపీఓ ఫీడ్ బ్యాక్ చార్ట్‌ను ప్రదర్శిస్తున్న డీసీపీఓ, సీడీపీఓ

మార్కాపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఎంఈఓలు రాందాస్‌నాయక్, శర్వాణి పేర్కొన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణలో భాగంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నూతన విద్యావిధానం, సమగ్రాభివృద్ధి, శారీరక అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధాభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కోర్సు డైరెక్టర్, హెచ్‌ఎం వి.శ్రీదేవి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బుజ్జి పాల్గొన్నారు.

బేస్తవారిపేట: అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని డీసీపీఓ రత్నప్రసాద్, సీడీపీఓ షేక్ నీలోఫర్ బేగమ్ సూచించారు. మంగళవారం స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలలో జ్ఞానజ్యోతి



మాట్లాడుతున్న ఎంఈఓ రాందాస్ నాయక్

శిక్షణ తరగతులు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ బడుల్లో కలుపుతున్నారని తెలిపారు. జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ సత్యవతి, రిసోర్స్‌పర్సన్లు కె.శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిత



గొట్లగట్టు జెడ్పీ విద్యార్థులతో ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి పేర్కొన్నారు. పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతీ పూజ చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని వక్తలు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఈ ఏడాది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటి బహుమతులు సాధించిన దుర్బాకుల ఉమాశంకర్‌కు మెమొంటోలు అందజేసి అభినందించారు. పాఠశాల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్న పీడీ బాలగురవయ్యతోపాటు హెచ్‌ఎంను ఉపాధ్యాయులు సన్మానించారు.

పొదిలిలో కమిషనర్ పర్యటన



పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

పొదిలి: పట్టణంలోని పలు ప్రాంతాలను నగర పంచాయతీ కమిషనర్ పి.శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. కార్యాలయం సిబ్బంది, పారిశుధ్య సిబ్బందితో కలిసి పాతూరులోని శివాలయం, దర్శి రోడ్డు, ప్రధాన రహదారిలో పర్యటించారు. రథోత్సవానికి వేల సంఖ్యంలో భక్తులు తరలిరానున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కమిషనర్ చెప్పారు. డ్రెయినేజీలు, రోడ్డు మార్జిన్లను శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, శ్రీకాంత్‌రెడ్డి, మేస్త్రీలు ఉన్నారు.

ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు

- మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకె



అన్నా రాంబాబు



జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: శివరాత్రి పర్వదినాన్ని మార్కాపురం నియోజకవర్గ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అధికారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. శైవక్షేత్రాలకు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న హమాలీలు

గిద్దలూరు రూరల్: కూలి ధర పెంపుతోపాటు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని సివిల్ సప్లయ్ హమాలీలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో హమాలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య మాట్లాడుతూ.. పౌర సరఫరాల శాఖ గోడౌన్లలో పనిచేస్తున్న హమాలీలకు కూలి రేట్లు తక్షణమే పెంచాలన్నారు. పెరిగిన ధరలతో కూలీలు ఆర్థికంగా ఇబ్బంది పడుతూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని చెప్పారు. హమాలీలుగా పనిచేసి వయసు రీత్యా విశ్రాంతి తీసుకుంటున్న వారికి పీఎఫ్ నగదు చెల్లించాలని కోరారు. కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ మేరకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు థామస్, కార్మిక సంఘం నాయకులు పిచ్చిరెడ్డి, ఓబులేసు, పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు రక్షణ కల్పించాలి



పోస్టుకార్డులను బాక్సులో వేస్తున్న నాయకులు

మార్కాపురం టౌన్: కాంట్రాక్టు కార్మికులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రూబెన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేయాలనే నిర్ణయాన్ని వెనక్కుతీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పోస్టుకార్డులు పంపుతున్నట్లు తెలిపారు. మంగళవారం స్థానిక పోస్టాఫీసు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆప్కాస్ సంస్థను ఏర్పాటు చేసిందని, కఠిన నిబంధనల కారణంగా కార్మికులంతా రాజకీయ వేధింపులకు బలికాకుండా నిలిచారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆప్కాస్‌ను రద్దు చేసి, ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని చూడటం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.సోమయ్య, యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరికృష్ణ, ఇమాంసా, సలాంఖాన్, అందె చిన్న నాసరయ్య, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.